"నీవు ఇలా ఉన్నావు. ఇప్పుడైనా నా మాట వినవా?" అన్నాను కుమిలిపోతూ.

"ఏం, ఇప్పుడు నాకేం వచ్చింది? ఈ వేళ కొత్తగా వచ్చింది కాదుగా!" ఏమీ పట్టించుకోకుండా సమాధానం చెప్పాడు, ఎంతో గారాబంగా పెంచుకున్న ఒకే ఒక్క కొడుకు నిరంజన్.

"ఇదంతా నా కర్మ. నా కొడుకుని కాపాడుకోలేని దౌర్భాగ్యుడివి. ఏం లాభం నా కెంత పేరుంటే? ఎంతమందికి నా మందులతో ప్రాణం పోస్తే ఏమిటి?"

"నీ మందులు నా కక్కరలేదు. నీ వైద్యం నా కొద్దు. నా వైద్యం నేను చేసుకోగలను. ఇంజక్షన్లు, టానిక్కులు చాలు నాకు. నీ కెందుకు గాభరా?"

"ఏమి మందులో ఏమిటో! నీవు చూస్తే చిక్కి శల్యమవుతున్నావు. అస్థిపంజరం తప్ప ఏమీ లేదు. నీ మొండితనం నీదే. దీపం ఉండగా ఇల్లు చక్కబెట్టుకోవా లంటారు. ఇప్పటికైనా నా మాట విను. నన్ను ఎందుకు క్షోభ పెడతావు?"

"నీవు చెప్పే మాట ఎప్పుడూ ఇదేలే! గుంటకలగాకు రసాలు, ఏవో కషాయాలు, కొప్పెలు మింగమంటావు. మందులు ప్రాణం పోస్తాయా? ఇంత వైద్యుడవే— నేను నీకు చెప్పాలా? కర్మని ఎవరూ ఏమీ చేయలేరు."

"నా కర్మ కాకపోతే ఈ స్థితి నా కెందుకు వస్తుంది? దానం కొద్దీ బిడ్డ లన్నారు అందుకే. ఏం దానం చేశానో నీకు తండ్రి నయ్యాను."

"పుణ్యం కొద్దీ పురుషు డన్నారు కూడా!"

"నీ దగ్గర నేర్చుకోవలసిన గతి పట్టింది! ఈ మెట్ట వేదాంతంతోటే చంపుతున్నావు. వేదాంతం మాటలలో కాదు, చేతలలో ఉండాలి."

"ఎందుకు ఉండదు?" అన్నాడు నిరంజన్, తను చేతలలో కూడా వేదాంతినే అన్నట్టు.

"కనబడుతూనే ఉంది. అప్పుడు మార్గం విడిచిపెట్టాలి. ఇప్పుడుకూడా... తీసుకోవడం మానలేదు ... తిరగడం మానలేదు. ఆ రెండూ విడిచిపెట్టలేనంత సేపూ మందులుమాత్రం ఏం చేస్తాయి? బుద్ధి మళ్ళించితేనే. లేకపోతే అంతా శూన్యం."

"ఏమిటి మీకు చాదస్తం మరీ ఎక్కువవుతోంది?"

"చాదస్తం కాదురా, చేతకానితనం. చూస్తూ చూస్తూ పెళ్ళిచేసి ఏ అమాయకురాలి గొంతూ కోయలేను. ఇప్పుడు ఒక్కటే బాధ. ఇంకొక బాధ కొని తెచ్చుకోలేను. పెళ్ళి చేస్తే బాగుపడతా వేమో నన్న ఆశ ఉన్నా, ఆ పనిమాత్రం చేయలేను."

"ఎందుకులెండి ఇప్పు డవన్నీ! ముందు సంగతి ఆలోచించండి" అంది సీత, నా భార్య, మింగలేక మింగుకుంటూ వచ్చే ఏడుపును. ఎంత ఆపుకుందామన్నా కళ్ళుమాత్రం చెమ్మగిల్లాయి. పమిటె చెంగుతో కళ్ళు వత్తుకుంది. తల్లి మనసు ఎంత బాధపడుతూందో నిరంజన్‌కు తెలియదు. తెలిస్తే తన జీవితాన్ని తన చేతులారా నాశనం చేసుకోడు. జీవితపు క్రొవ్వొత్తిని రెండు వైపులా వెలిగించి ఆనందించడానికి ప్రయత్నించాడు నిరంజన్.

"ఏం ఆలోచించమంటావు? చేయి జారిపోయిన తరవాత చేసేది ఏమీ లేదు. ఎలా జారిపోకుండా ఉంటుందా అన్న ఆవేదనే. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఒక్క నెల నా మాట వింటే చాలు. వాడి జీవితం కాపాడగలను."

"ఎందుకండీ అపశకునం మాటలు?" అంది సీత.

"నా బాధ నీ కెలా తెలుస్తుంది! నీకు చెప్పడం ఎలాగ? నీవు వాడికి తల్లివి. అంతే. మరి నేనో? తండ్రిని. పైగా వైద్యుడిని. వైద్యుడుగా నా బాధలో తండ్రి నన్నది గుర్తుకు వస్తే నా స్థితి ఎలా చెప్పేది? చెప్పలేను. ఏమీ చేయలేను. చూస్తూ నాలో నేను కుమిలి పోవలసిందే. ఇలాంటి కర్మ పగవాడికి కూడా వద్దు" అంటూ లేచాను.

సీత నిరంజన్ మంచం పక్కనే కూర్చుని ఉంది. బల్లిలా మంచాన్ని అంటిపెట్టుకుని రోజులు లెక్క పెడుతున్న నిరంజన్ తల నిమరడం మొదలు పెట్టింది. ఆమె చేయి అప్పటికే చెమటతో చల్లగా ఉండి ఉంటుంది. ఆ చేయి తగలగానే నిరంజన్ ఆమె కళ్ళలోకి చూశాడు. ఆమె కళ్ళు నీళ్ళతో నిండి ఉన్నాయి. దీనత్వం ఆ ముఖంలో తాండవం చేస్తూంది. నిరంజన్ తనకేసి చూసే సరికి సీత వచ్చే ఏడుపును ఆపుకోలేక పోయింది. కన్నీళ్ళు బొటబొటా రాలి అతని పక్కమీద పడ్డాయి. బేరుమని తన ముఖాన్ని మంచం మీద దాచుకుంది. అప్పటివరకూ నాకు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పిన నిరంజన్ కళ్ళలోకి నీళ్ళు అప్రయత్నంగా వచ్చాయి. తన ఈనెపుల్లలాంటి చేతిలో తల్లి చేతిని గట్టిగా పట్టుకున్నాడు. ఆ ఆవేదనలో ఇద్దరి మనసులు ఒకటయ్యాయి.

"నిరంజన్, ఏడుస్తున్నావా? నేను చూడలేను" అంటూ సీత తన పైట చెంగు తీసుకుని అతని కళ్ళు వత్తింది.

"లేదమ్మా. మా అమ్మకు శోకం కలిగించాను. నన్ను క్షమించు."

"లేదు. నీవు బాధపడితే నేను చూడలేను."

"నిన్ను బాధపెట్టిన నిర్భాగ్యుడి నమ్మా. నా జీవితంలో నవ్వులు పండుతాయా?"

"తప్పకుండా. నా గురించి నవ్వుతావు. నూరేళ్ళు బ్రతుకుతావు. అలా కాకపోతే నేనూ బ్రతకను. నిన్నా దేవుడు చల్లగా చూడకపోతే నాకూ, ఈ లోకానికీ ఋణం తీరిం దనుకో."

"అంత మాట వద్దమ్మా. నీ గురించి బతుకుతాను. నన్ను దీవించు."

"నీవు నూరేళ్ళు వర్ధిల్లాలి!" అంటూంటే బొటబొటా రాలాయి కన్నీళ్ళు, ఆనంద బాష్పాలు అన్నట్టు. తన చల్లని చేయిని అతని గుండెలపై వేసింది. అతి నీరసంగా కొట్టుకుంటున్న అతని హృదయం మాతృమూర్తి ఆవేదన విన్నట్టుగా ఉంది. నిరంజన్ ముఖంలోకి ఒక్కసారి ఏదో తేజస్సు ప్రవేశించిందా అనిపించింది. బహుశః అతని మనస్సు మాతృదేవత మనస్సులో లీనమై చిగురాకు వేసి ఉండాలి.

"అమ్మా! నేను శ్రోత్రియ వంశంలో పుట్టానన్న విషయం నాకు తెలుసు. నా ధర్మం నాకు తెలుసు. నా వంశ మర్యాద మంట కలపకూడదని తెలుసు."

"మరి తెలిసి ఎవరైనా చెడ్డపని చేస్తారురా, నిరంజన్?"

"అదేనమ్మా నాకూ అర్థం కానిది. నాకు తెలిసిందిమాత్రం ఇది — ఆ పనులు చేసేటప్పుడు నేను నేను కాను. నేను అంటే నాలో ఉన్న మంచివాడు. నాలో ఉన్న ఆ చెడ్డవాడు మహా చెడ్డ వాడు."

"అందరిలోనూ ఉంటారు వాళ్ళిద్దరూ. మరి అందరూ నీలా ఉన్నారా?"

"ఉండరు. కాని, ఆ చెడ్డవాడికి నాలో పై చేయి ఎందుకు ఉండాలో తెలియదు."

"విషయాలపై మనస్సు ఉన్నంత సేపు అంతే, నిరంజన్! అవి వెంటనే సుఖాన్ని ఇస్తాయి కనక మనస్సు వాటిని విడిచిపెట్టలేదు. ఆ సుఖం క్షణికంరా! ఏ విషయమైనా ముందు సుఖాన్ని కలిగిస్తే, చివరకు అదే దుఃఖాన్ని కలిగిస్తుంది."

డి. వి. ఎస్. ఆర్. మూర్తి

"మా అమ్మ ఇంత వేదాంతం ఎప్పుడు నేర్చుకుంది?"

"మీ నాన్నగారిని పెళ్ళిచేసుకున్న తరవాత!"

ఆ మాటలకు నిరంజన్ ముఖంలో చిరునవ్వు కనిపించింది.

• • •

నేను పోయి సావిడిలో పడక కుర్చీలో కూలబడ్డాను. మనస్సు మనస్సులో లేదు. శరీరం ప్రాణం లేని కట్టెలా ఉంది. కుర్చీలో వాలి చుట్ట తీశాను. అగ్గిపుల్ల గీసి వెలిగించాను. అగ్గిపుల్ల మంటలో కొంత బాధ కాలిపోయింది. ఆ మంటలో అంటుకున్న చుట్ట కాలడం మొదలు పెట్టింది. చుట్ట కొననిప్పుపై నా దృష్టి నిలబడింది. పొగ పీల్చాను. ఆ పీల్చడంతో నా దృష్టి బయట కనుపించే చుట్ట నిప్పుపై లేదు. నా లోపల గల మంట వైపు తిరిగింది. ఆ మంటవైపు దృష్టి ప్రసరించేసరికి బాహ్య ప్రపంచం లోంచి మనః ప్రపంచంలోకి ప్రవేశించాను. పీల్చిన పొగ విడిచిపెడుతూంటే రింగులు రింగులుగా అది పైకి పోయి శూన్యంలో కలిసిపోతూంది. దృష్టికి గోచరించే పదార్థాలన్నింటి బ్రతుకు ఇంతేగా అనుకున్నాను. వెనకకు మరలిన దృష్టితోబాటు వెలువడే ఆలోచనా సముద్రంలో కొట్టుకుపోవడం మొదలు పెట్టాను. అలా కొట్టుకుపోతూంటే ఏదో చెప్పలేని ఆనందంలో మునిగితేలుతూన్నట్టుంది. ఆ ఆనందంలో మనస్సుకు ఏదో శాంతి లభించింది. ఆ స్థితి చాలా హాయిగా ఉంది. దానిలో కర్మేంద్రియాలు ప్రపంచ బంధాల నుండి విడివడ్డాయి. దానితో ఒక నిద్రలాంటి మగత వచ్చింది. ఆ మగత ఏమిటో తెలియలేదు. కాని, అది మాత్రం ఒక అపూర్వమైన అనుభూతి. అది నిద్ర అంటే నిద్రకాదు. మరి సుషుప్తి అంటే అదీ కాదు. మరి జాగ్రదవస్థ అసలే కాదు.

• • •

నా మనః ఫలకంపై నా ప్రస్తుత స్థితి ప్రతిబింబించింది. బయట లంద రకూ దేవుడు. ఇంట్లో ఏమీ చేతకాని వాజమ్మ. ఈ సంగతి ఎంత మందికి తెలుసు? తెలిస్తే వాళ్ళ మాటంకు అర్థమేమిటి?

"నీవు మా ఊరికే ఒక మాణిక్యం లాంటి వాడవు" అంటూ డొక పెద్ద మనిషి.

"అది మీ సహృదయం."

"కాదు. అది నిజం. కాకపోతే మా



ఊరూ పేరూ ఎవడికి కావాలి? ఎన్ని ఊళ్ళనుంచి, ఎంత దూరం నుంచి, ఎంతమంది నీ వైద్యంకోసం వస్తున్నారు? ఏం, ఊరికే వస్తున్నారా?"

"అది భగవంతుని దయ. మనం నిమిత్తమాత్రులం."

అలాంటి పొగడ్తలు రోజూ వస్తూనే ఉంటాయి. ఆక రోగం మాట చెప్ప వక్కరలేదు.

"ఏమండీ, శాస్త్రులుగారూ! మీకు ఏదైనా దేవీ ఉపాసన ఉందా?" అన్నాడు, వైద్యం చేయించుకోవడానికి హైదరాబాదు నుండి వచ్చిన ఒక పెద్ద ఉద్యోగి.

"ఏం, అలా అంటున్నారు?"

"ఏం లేదు. నేను హైదరాబాదు జనరల్ హాస్పిటలులో వారం రోజులు ఉన్నాను. ఆ వారం రోజులు పరీక్ష చేసి వాళ్ళు ఒక నిర్ణయానికి వచ్చారు. మీరు నా నాడి కొన్ని నిమిషాలుకూడా పరీక్ష చేయలేదు. నా రోగ నిర్ధారణే గాక దాని పుట్టుపూర్వోత్తరాలు పూసగుచ్చినట్లు చెప్పారు. ఇది నేను నమ్మలేక పోతున్నాను."

"అది నా ప్రతిభ కాదండీ. మన ఆయుర్వేదం ప్రతిభ. నాడీ పరీక్ష మన వైద్యశాస్త్రంలో అంత బాగా చెప్ప బడింది."

మరి ఆ పక్క ఊరి అక్కాభిరాజు చేసిన





పెరిగే పాపాయిలకు
రుచివంతమైన తోడు

బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు మరి అంత ప్రత్యేకమైన రుచి గలిగి ఉండటానికి ఏమిటి కారణం? వాటిలో గల సమృద్ధినిచ్చే, సంపూర్ణమైన పుష్టినిచ్చే అంశాలే. పిల్లలకు అవి ఇష్టం. పెరుగుతారు ఎంతో బాగా హుషారుతో. బ్రిటానియా గ్లాక్సో బిస్కట్లు ఎదిగే మీ పిల్లలకు ఎంతో మంచివి.

బ్రిటానియా
బిస్కట్లు అత్యుత్తమమైనవి
క్లారియన్-BBC.GLX-6-140 TL



బావిక...            చిత్రం— వి. సత్యనారాయణరావు (తెనాలి)

సన్మానం తలుచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

"మీరు చెప్పిందే నిర్ధారణ చేశారండి ఆ అమెరికా నుండి వచ్చిన డాక్టరు" అన్నాడు ఆ లక్షాధికారి, అతని భార్య విషయంలో. నేను ఆమెను పరీక్షచేసి గుండె జబ్బు అని చెప్పాను. ఒక ధమని దెబ్బతిన్నదని నిర్ధారణ చేశాను. దానికి తృప్తిపడక అమెరికా నుండి డాక్టరును పిలిపించి పరీక్ష చేయించాడు. అతడు కూడా అదే చెప్పాడు. అమెరికా వస్తే ఆపరేషను చేస్తా నన్నాడు. ఇండియాలో పరికరాలు లేవట. పైగా నమ్మకంకూడా చెప్పలేనన్నాడు. ఆ జబ్బు నయం చేయడంతో నాకు వచ్చిన పేరు, జరిగిన సన్మానం చెప్పడానికి వీలులేదు. ఆయుర్వేదం ఎంత గొప్ప శాస్త్రమో లోకానికి చూపించాను. పిల్లలకు వచ్చే పక్షవాతానికి (పోలియో) మందు లేదని అందరికి నమ్మకం. ఎంతమంది పిల్లలకు కుదిర్చానో లెక్కేలేదు. ఈ జబ్బు, ఆ జబ్బు ఏమిటి...పక్షవాతం అయినా, పచ్చకామెర్లు అయినా, మూలశంక అయినా, మూర్ఛ అయినా, మరేదయినా తగ్గవలసిందే. ఒకాయన ఏదో పరీక్ష పెట్టినట్లు ఫామిలీ ప్లానింగ్‌కు ఆయుర్వేదంలో మందు లేదా అన్నాడు. ఆపరేషనులతో అద్వాన్న అయ్యా రనుకున్నదేమీ లేదు. ఆయుర్వేదం మందులు చాలని నిరూపిస్తే వాళ్ళకు మతి పోయింది.

"ధన్వంతరిని మేము చూడలేదు కాని మాకు మీరే అపర ధన్వంతరి" అని సాష్టాంగ నమస్కారం చేసేవారు.

ఇక శాస్త్ర విషయాలు మాట్లాడుతూంటే అందరూ అలా కూర్చుని వినవలసిందే. మొద్దు అబ్బాయికి ఇంత పాండిత్యం, ప్రతిభ ఎలా వచ్చాయన్న సంశయమే నా చిన్నతనం తెలిసిన వాళ్ళకి.

"ఈ శాస్త్రం ఎప్పుడు పుక్కిట పట్టారు?" అన్న ప్రశ్న చాలా మంది వేసేవారు. వస్తు గుణాలు, ఓషధుల విషయాలు గురించి చెపితే వాళ్ళకు ఆశ్చర్యంగా ఉండేది.

"ఉత్తరేణిలో ఎంత విశేషం ఉందో తెలుసా?"

"మాకు ఏం తెలుస్తుంది? మీరే చెప్పండి" అనేవారు.

"ఉత్తరేణి వేళ్ళరసం రోజూ ఉదయం తీసుకొంటే మూర్ఛ రోగం తగ్గుతుంది. అది అలా ఉంచండి. వాల్మీకి సీతాదేవిని అశోక వృక్షం క్రింద ఎందుకు ఉంచాడు? ఇక చెట్లు ఏమీ లేవా? ఏ భవనాలూ లేవా?"

"చాలా విచిత్రమైన విషయమే" అనేవారు అందరూ.

"అశోకవృక్షం ఒక్కటే స్త్రీ గర్భధారణ శక్తిని నిలబెడుతుంది. మన పురాణాలలో ఎన్ని శాస్త్రాలు ఇమిడి ఉన్నాయో ఎవరికి కావాలి?"

"మనకు తెల్లవాడు చెప్పిందే శాస్త్రం ఈ నాడు!" అనే వారు కొందరు.

"పోనీ లెండి ఆ విషయం. మన కొండ నాలుకకు తలవెంట్రుకలాంటి రంధ్రమున్నట్లు ఎంత మందికి తెలుసు?

'అన్తరేణ తాలుకా! య ఏషస్తన ఇవావలంబతే! సేంద్రయోనిః య త్రాసౌ కేశాన్తో వివర్తతే!'

ఇక వేదంలోంచి, శాస్త్రాలలోంచి విషయాలు చెపుతూంటే వినేవాళ్ళకి మతి పోయేది.

"ఈ పాండిత్యమంతా ఎందుకండి మీ వైద్యానికి?" అనడం కూడా ఉండేది.

"ఆయుర్వేదం గొప్ప శాస్త్రం. మన ఏ శాస్త్రమైనా గమ్యం చేరుస్తుంది. ఆ గమ్యం మోక్షం. రసాన్ని భస్మంచేసి వైద్యుడు పాపం మూటకట్టుకుంటాడు. ఆ పాపం నుండి ముక్తి నిష్కామ కర్మ ద్వారానే."

ఇలా వేదాంత విషయాలు, శాస్త్ర విషయాలు చెప్పడం వల్ల నా ప్రతిభ మరింత పెరిగింది. కాని, ఏం సాధించానన్న విధి చాలా క్రూరమైంది. పైపటారం లోన లొటారం. ఏ విధంగానూ మనస్సుకి శాంతి లేదు. ఓటమే జీవితమయింది.

• • •

నా ఆలోచనలు నా చిన్నతనం వైపు ప్రయాణం చేశాయి. తండ్రి కృష్ణశాస్త్రి శ్రోత్రియ బ్రాహ్మణుడు. అతడికి హాయిగా తిని, నలుగురికి తిండి పెట్టగల ఆస్తిపాస్తు లున్నాయి. అతనికి ఇంగ్లీషు చదువంటే మోజు. అతని పిల్లలకు పెద్ద పెద్ద ఇంగ్లీషు చదువులు చెప్పించి, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయించాలని కలలు కనేవాడు. కాని, అతనికి ఒక్కడే కొడుకు. అతడే నేను, అన్నాజీరావును. నాకు చదువు చెప్పించి ఏ కలెక్టరో, కమెర్షియల్ టాక్స్ ఆఫీసరో చేసేద్దా మనుకున్నాడు. ఒక్కణ్ణే కావడం వల్ల నాకు ఎంతో గారాబం ఇంట్లో. నా మాటకి తిరుగు లేదు. నా ఇష్టం వచ్చినట్లు ఉండేవాణ్ణి. తండ్రి మాట ఎప్పుడూ లెక్కచేయలేదు. ఇప్పుడు నా కొడుకుమాత్రం నా మాట ఎలా వింటాడు? వినాలనుకోపడం తెలివి తక్కువ. చదువుకునే రోజులలో నేను విచ్చలవిడిగా తిరిగాను. ఊళ్ళో నాతోటి వాళ్ళందరికీ పెద్ద నాయకుణ్ణి. అలాంటి వాళ్ళే పెద్ద అయితే దేశ నాయకులట. ఒకసారి నా దండుతో ఆ ఊళ్ళో గంగమ్మ దొడ్లో ప్రవేశించాను. అక్కడున్న జామి చెట్టుపై దాడి జరిపాము. నేను చెట్టుపై కొమ్మ మీద ఉన్నాను. కాయలు కోసి క్రిందనున్న వాళ్ళకు విసురుతున్నాను. ఈ లోపుగా గంగమ్మ పెద్ద కేకలు వేసుకుంటూ తలుపు తీసుకుని వచ్చింది. గంగమ్మ ఆ ఊళ్ళో పేరుమోసిన బ్రహ్మరాక్షసి. ఆమె రంకెలు విని చెట్టు క్రింద ఉన్న వాళ్ళు పలాయనం చిత్తగించారు. కంచె దూకేవాళ్ళు, కంచెలోంచి దూరే వాళ్ళు, తోక ముడిచి పారిపోయే కుక్కల్లా పరుగెత్తే వాళ్ళు — ఒక్క క్షణంలో చెట్టు క్రింద ఒక్కడూ లేడు. చొక్కాలు చిరిగిపోయినవాళ్ళూ, మోకాళ్ళు కొట్టుకుపోయినవాళ్ళూ, ఒళ్ళు గీరుకు పోయి రక్తం వచ్చినవాళ్ళూ బ్రతుకుదేవుడా అని బయటపడి ఒక్క చిటికెలో మాయమయ్యారు. చప్పుడు చెయ్యకుండా నేను చెట్టుపై కూర్చున్నాను. బ్రహ్మరాక్షసి లోనికి పోయిన తరవాత నెమ్మదిగా చెట్టు దూకి పరుగెడదా మనుకున్నాను. లాభంలేకపోయింది.

"ఓరి భడవా! నువ్వటరా! దిగు. నీ వీపు చీల్చేస్తాను. దిగు. తొందరగా దిగు. లేకపోతే చూడు నా తడాకా" అంటూ తాటకిలా అరిచింది.

"బాపమ్మా! న వ్వెక్కమన్నారే వాళ్ళంతా."

"బాపమ్మ, గీపమ్మ! దిగు ముందు. డొక్క చీరేస్తా."

ఇక ఆలస్యం చేస్తే ఏం ప్రమాదం వస్తుందో అని నెమ్మదిగా దిగడం మొదలు పెట్టాను. కాళ్ళు, చేతులు వణకడం మొదలు పెట్టాయి. దిగుతూ దిగుతూ మొదలు దగ్గరకు వచ్చేసరికి చేతులు జారి తాటిపండులా క్రిందపడ్డాను.

"అయ్యబాబోయ్! చచ్చా, చచ్చా, బాబోయ్" అని అరవడం మొదలు పెట్టాను. గంగమ్మకు గాభరా పుట్టింది, తనవల్లే ప్రమాదం జరిగినట్లు.

"ఓరి నాయనోయ్! ఇంత జరుగుతుందనుకోలేదురోయ్!" అంటూ లేవతీసి కాలు సాగదీసింది. కుంటుతూ రెండు మూడు అడుగులు వేసి దౌడు తీశాను.

"ఓరి దొంగ వెధవా! పుండాకోరు పోకిరీ చవటా! నన్నే బోల్తా కొట్టించావు" అంటూ గంగమ్మ అరిచింది.

ఇక వినాయక చవితి వచ్చిందంటే ఊళ్ళో అందరికీ భయమే. ఆ ఊళ్ళో చాలామందికి భయం—చంద్రుడిని చూడడానికి కాదు, నా దండు అల్లరికి

ఇప్పుడది తలుచుకుంటే నవ్వాలో, ఏడవాలో తెలియదు. ఆ చిలిపితనం, సరదా ఆ వయస్సువే. వినాయక చవితి పెద్ద పండుగ అందరికీ, ఉదయం పూజా పునస్కారాలతో. పండుగంతా నాకు రాత్రే. ఇళ్ళ తలుపుల మీద, కిటికీల మీద రాళ్ళ వర్షం కురిపించడం, పారిపోవడం. ఎప్పుడు ఆ వర్షం కురుస్తుందో బ్రహ్మదేవుడికి కూడా తెలియదు. అందుకు రాత్రంతా అన్ని తలుపులు మూసుకుని కూర్చోవలసిందే. ఇదేమిటని అడిగేవాళ్ళు కాని, వద్దని చెప్పగలిగిన వాళ్ళు కాని అక్కడ లేరు. ఆ చెప్పగలిగిన వాళ్ళ ఇంటి మీద రాళ్ళు పడవు కనక వాళ్ళు చెప్పరు. ఏదో పిల్లలు—పోనీయం డనేవారు.

ఒక వినాయక చవితికి పల్లేరు కాయలు బాగా సేకరించాము. గంగమ్మ గుమ్మం ముందు పోశాము. గంగమ్మను ఏదో పెద్ద పని ఉన్న వాళ్ళలా పిలిచాము. ఏమో అనుకొని తలుపు తీసుకొని బయటకు వచ్చింది. పల్లేరు కాయల మీద కాళ్ళు వెయ్యడం, బాబోయ్ బాబోయ్ అంటూ క్రింద పడడం ఒకేసారి జరిగాయి.

“ఈ కుర్ర చచ్చినాళ్ళు నా ప్రాణం తీసేస్తారోయ్ ఎప్పుడో” అంటూ పెద్దగా గోల పెట్టడం మొదలుపెట్టింది.

“భలే పని అయింది, భలే పని అయింది” అంటూ అరుచుకుంటూ, నవ్వుకుంటూ పారిపోయాము. నా చిలిపితనం వల్ల ఆ మనస్సు ఏం క్షోభ పడిందో!

ఇక సంక్రాంతి వస్తే అల్లరి వేరు. అది మంటల పండుగగా? ఎంత పెద్ద మంట వేస్తే అంత గొప్ప. ఇక నా దండుకు వారం రోజుల ముందు నుంచీ పండుగే. ఎక్కడెక్కడి నుండో దుంగలు కొట్టి చేరవేయడం. ఒకసారి భోగి మంట సామగ్రికి ఆ ఊళ్ళో ఒక ఉమ్మడి వంటసావడిలో ప్రవేశించాము. అక్కడ భోగి మంటకు ఏం ఉంటాయి? కత్తిపీట, కవ్వం, పీటలు, చేటలు, చీపురు కట్టలు, పోపులపెట్టె, ఉప్పు తొట్టె— ఇవేమిటి, అవేమిటి చేతికి దొరికిందల్లా తీసుకెళ్ళి భోగి మంటలో వేసేశాము. ఇక ప్రొద్దున్న చూడాలి. ఊరంతా గగ్గోలే.

“ఆ దొంగ వెధవ రావు పనే ఇది” అంటూ అందరూ నానా మాటలూ అన్నారు. కాని, రావని బుజువేది? ఆయన పెద్ద గొడవ చేసి పోలీసు కంప్లెయింటు చేస్తానంటే ఊరికి మంచిది కాదని పెద్దలంతా నష్టపరిహారం చెల్లించారు.

చిన్నతనం అంతా కిలకిలా గడిచిపోయింది. ఆ రోజులలో బ్రతికింది మరో ప్రపంచంలో. జీవితం అంటే సరదా అనుకునే రోజులు. దానితో చదువు సంధ్యలు వెనకబడ్డాయి. చదువుకోవాలన్న జ్ఞానం వచ్చేసరికి పరిస్థితులు చేజారి పోయాయి. చదువుకు ఎనిమిదవ క్లాసుతో స్వస్తి. అప్పటికే పదహారు ఏళ్ళు వచ్చాయి. జీవితం నన్ను చూచి నవ్వింది. తొలిసారి ఓటమి చూశాను. దానిని గెలుపుగా మార్చాలనుకున్నాను.



కోణార్క మందిరం — ఫోటో— ఎన్. ప్రసాదరెడ్డి (ఇచ్ఛాపురం)

* * *

నాకు పట్టుమని పాతికేళ్ళు రాలేదు. పేరుమోసిన డాక్టరయ్యాను. నా అంత డాక్టరు ఆ చుట్టుపట్ల ఎవ్వడూ లేడు. డబ్బు కూడా రెండు చేతులతో సంపాదించడం మొదలైంది. ఈ ప్రతిభతో ప్రేమ కూడా రేకెత్తింది. కామిని అతిలోక సుందరి. ఆమెను పొందిన వాడిదే అదృష్టం అనుకునేవారు. అందంలో కామినికి సమానం కాకపోయినా, ఆమెకు సరిపడనని ఎవ్వరూ అనరు. డాక్టరుగా అవకాశాలు వచ్చాయి. వాటిని వినియోగించుకున్నాను. కామిని కూడా నన్ను ప్రేమించింది. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుకున్న నా ఆశయం నెరవేరే సమయం వచ్చిం దనుకున్నాను. నా ఆనందానికి అవధులు లేవు.

“ఏమిరా, కులం తక్కువదాన్ని పెళ్ళి చేసుకుంటావా?”

“ఇంకా కులాలేమిటి? ప్రేమకు కులాలు లేవు. నేను కామినిని తప్ప ఎవ్వరిని పెళ్ళిచేసుకోను” అన్నాను నేను.

“ఇదెక్కడి కర్మ వచ్చి పడిందిరా!” అంది అమ్మ.

“కర్మ కాదు. ముందడుగు.”

“ఆ ముందడుగు మనం ఎందుకు వెయ్యాలిరా? ఈ ఊళ్ళో మేము ఎలా తల ఎత్తుకుని తిరగడం? మనలని వెలేస్తారు” అన్నాడు నాన్న.

“అంతా మన ఇంటికి వచ్చే వాళ్ళే. వెలేసేది ఎవరు?”

“పోనీరా. నీకు నచ్చిన పిల్ల దొరకదా? లోకం గొడ్డు పోలేదు” అన్నాడు నాన్న.

“అది వేరే విషయం. నే నెక్కువా మీకు, మిగిలిన విషయాలా?”

“తప్పకుండా నువ్వేరా. నీ తరవాతే లోకం. మరి నీకో?” అంటూ అమ్మ అన్న తీరు బాణంలా మనస్సుకి తగిలింది. ఆమె చూపులో మాతృదేవి కనుపించింది. ‘మాతృదేవో భవ పితృదేవో భవ’ అన్న వాక్యం స్ఫురణకు వచ్చింది.

“తప్పకుండా మీరే ఎక్కువ” అన్నాను అప్రయత్నంగా.

“మరి ఆ మాట నిలబెట్టుకో” అన్న అమ్మ మాట నన్ను కట్టేసింది. మరొకసారి జీవితంలో ఓటమి ఎదురైంది.

ప్రేమ కామంగా మారింది. కాని, కామిని జీవితం పాడుచేయడం రుచించ లేదు. జీవితం అడ్డదారులు పట్టింది. నలకూబరుడని, గోపాలకృష్ణుడని, విప్రనారాయణుడని గుసగుసలు ప్రారంభ మయ్యాయి. రభస కాకుండానే పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నారు. పక్క ఊరి వెంకటశాస్త్రి తన కుమార్తె సీతను ఇస్తానని వచ్చాడు. నా తండ్రి కృష్ణశాస్త్రి ఆనందానికి అంతులేదు. పెళ్ళిచేస్తే తిన్నబడతా ననుకున్నాడు. వెళ్ళి పిల్లని చూశాము. పిల్లతోపాటు కట్న కానుకలు వచ్చాయి.

“కృష్ణశాస్త్రి గారి అబ్బాయి సీతని చూచి వచ్చాము. అన్ని విధాలా నీకు తగిన పిల్ల” అంది అమ్మ.

“ఇప్పు డేం తొందర వచ్చింది? నేను ఇంకా పెళ్ళిచేసుకోను.”

“అసలు పెళ్ళి చేసుకోవా లేక ఇప్పుడా?” అన్నాడు నాన్న.

“ఎలా అనుకున్నా ఫరవాలేదు” అని కొంచెం కటువుగానే అన్నాను.

“నువ్వు ప్రేమించిన కామినిని చేయుతే దనా?” అంది అమ్మ.

“నేను చేయమని పట్టుపట్టానా?”

“ఆ నాడు నా మాట కిచ్చిన గౌరవానికి నేను పొంగిపోయాను. ఎప్పుడూ

నీలాంటి కొడుకు నిమ్మని ప్రార్థించు కున్నాను.''

''నీ కొడుకు నీ మాట కాదనడు. సరేనా?'' అని మరొకసారి ఓడిపోయాను.

పెళ్ళికి ప్రేమ అక్కరలేదని తెలిసింది. సీత హిందూ స్త్రీ. భార్యగా తన ధర్మం ఏమిటో తెలుసు. తన విధులలో ఏ లోటూ లేకుండా పతి జీవితానికి తన జీవితం అంకితం చేసింది. ఆ అమాయకురాలి జీవితం నరకం చేయడం ఇష్టం లేదు. పతి ప్రాతను పోషించడం నేర్చుకున్నాను. నా తల్లితండ్రులు కొడుకు బాగుపడ్డాడని సంతోషించారు. నాటకం బాగానే రక్తికట్టింది.


డాక్టరుకు ఎవరింటికైనా వెళ్ళడానికి స్వేచ్ఛ ఉంది. నేను డాక్టరుగా ఎవరింటికైనా వెళ్ళడం అరుదు. ఇక తప్పనిసరి అయితేనే వెళ్ళేవాడిని. నేను అప్పుడప్పుడు పక్క ఊరిలో కనకం ఇంటికి వెళ్ళడం ఉండేది. ఆమె భర్త వెర్రిబాగులవాడు. కనకం, ఆమె తల్లి కలిసి అతడిని అలా చేశారంటారు. ఆ ఊరి మునసబుకి, పక్క ఊరి మాస్టారికి, మరి కొంత మందికి కనకంతో సంబంధం ఉన్నట్లు అందరికీ తెలిసిన విషయమే. ఆ జాబితాలోకి నా పేరు ఎక్కింది.

వైద్య వృత్తిలో ఒక రోజు రామవరం వెళ్ళాను. అది సుమారు పది మైళ్ళ దూరంలో ఉన్న ఊరు. అక్కడి కేసు లన్నీ చూసి బయలుదేరదా మనుకునే సరికి కబురు వచ్చింది—ఒక పెద్ద భూస్వామికి ప్రమాదంగా ఉందట. వెళ్ళి చూశాను. రోగి ప్రమాదస్థితిలోనే ఉన్నాడు. సన్నిపాత జ్వరం జీర్ణించింది. నూది మందు డాక్టర్లు లాభంలేదని పెదవి విరిచారు. నేను వాడి పరీక్ష చేస్తున్నాను.

''నాకు పతి భిక్ష పెట్టండి'' అన్న స్త్రీ స్వరం వినిపించింది. ఆ గొంతుక చిరపరిచితంగా ఉన్నది. ఏవేవో మధుర భావాలను పిలుస్తున్నట్లుంది. నాడి పరీక్ష అయిన తరవాత పొట్ట అంతా పరీక్ష చేసి తల పైకి ఎత్తాను. ఎదురుగా కళ్ళ ముందు ఉన్నది కామిని. కల ఏమో అనిపించింది ఒక్క క్షణం. నా కామిని భర్త ఇంత పెద్దవాడా? ఎలా ఉండవలసిన కామిని ఎలా ఉంది? దానికి కారణం నేనా? నిజానికి కామినికి ఏ లోటూ లేదు. బోలెడు ఆస్తి, ఇంటి నిండా నౌకర్లు, చాకర్లు.

''నా శక్తి కొలది ప్రయత్నిస్తాను'' అన్నాను తల వంచుకుని. కామిని నా మనో భావాలు చదివినట్లుంది. మందులు ఇచ్చి వచ్చేస్తుంటే వెనకనే సాగనంపడానికి వచ్చింది కామిని.

''మీరు పెళ్ళిచేసుకున్నారటగా? పిల్లలా?'



ఫోటో— ఎస్. వెంకట్ (బెంగుళూరు—38)

ఆధారం

''అయితే, నా విషయం అంతా తెలుసన్న మాట! మరి నీ విషయం. ఈ పెళ్ళి ...''

''డబ్బుని పెళ్ళి చేసుకున్నా. నా కులం వాడిని చేసుకున్నా. సుఖంగా ఉన్నా. ఏం, మంచిపని చేయలేదా?''

''నన్ను ఇంకా వెర్రివాడిని చేయకు. పోగొట్టుకున్నది చాలు.''

''పోగొట్టుకున్నది తిరిగి సంపాదించడానికి ప్రయత్నించకండి.''

ఆ చివరి మాటలో వ్యంగ్యం అర్థమైంది. అలా చెప్పడంలో ఉద్దేశ్యం ఏమిటో? పోగొట్టుకున్నదానికి ప్రయత్నం చేయవద్దనా? లేక వచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని పోగొట్టుకున్నది సంపాదించమనా? మతి పోయింది. కామినిలో ఏమీ మార్పులేదు. చిలిపితనం, సింగారం తొణికిసలాడుతూనే ఉన్నాయి. అంటే, తప్పక సుఖంగానే ఉండి ఉండాలి. కామిని తిరిగి నా మనస్సులో ప్రవేశించింది. కల్లోలం చెలరేగింది. ఇల్లు చేరుకున్నాను.

''ఏదో పెద్ద ఆలోచనలో ఉన్నట్లున్నారు'' అంది సీత, భోజనం పెడుతూ నా ధోరణి గుర్తించిన దానిలా.

''ఏముంటుంది డాక్టర్లకు! రోగుల గురించి.''

''అలా ఆలోచిస్తే మీకూ వస్తుంది జ్వరం.''

''జ్వరం ఇప్పుడు రాలేదా?'' అని అప్రయత్నంగా నిజం చెప్పేశాను. పడుకున్నా నన్ను మాటే కాని, నిద్ర రాలేదు. ఆలోచనలతో మతి చెడుతుందా అని పించింది. కామిని గురించి ప్రాణం తీయడమా లేక ప్రాణం కాపాడడమా అన్న యుద్ధం చెలరేగింది. తరవాత కొద్ది రోజులు నా జ్వరం ఎక్కువైంది, కామిని భర్తకు సంబంధించి.

''ఈ రోజు ఇంత సంతోషంగా ఉన్నారు?'' అడిగింది సీత ఒక రోజు.

''ఆ రోగి — నే నాలోచించానే — ఆ రోగి బతికాడు. నేనుచచ్చిపోయాను.''

''అశుభం మాటలు. ఏమి టవి? నేను మాట్లాడ నయితే.''

''అశుభం కాదు. శుభమే!''

నేను నిజమే చెప్పాను. వాళ్ళ పతుత్వం నశించింది. ఆ రోజులలోనే సీత కడుపు పండింది.

''దోషి ఎవరు?''

''నేనే, నిరంజన్ కాదు'' అని వెంటనే సమాధానం వచ్చింది. నా జీవితం వెలుగు కాలేదు. వెలుగు చీకటయింది. ఈ ప్రపంచం ఎంత గుడ్డిది? ఎంత చెడ్డది? ఒకరు చేసిన తప్పులకు ఇంకొకరిని నిందిస్తుంది. ఒకరు చేసిన తప్పులకు మరొకరు అనుభవిస్తారు.

''ఏం, భోజనం చేయరా?'' అన్న సీత మాటలు నన్ను వాస్తవ ప్రపంచం లోకి తీసుకొని వచ్చాయి.

''వస్తున్నా'' అంటూంటే శ్రుతి నుండి వాక్యాలు అప్రయత్నంగా నోటి నుండి వెలువడ్డాయి.

''కామో కారషీన్నమోనమః, కామో కారషీత్కామః కరోతి నాహం కరోమి కామః కర్తా నాహం కర్తా, కామః కారయితా నాహం కారయితా ఏషతే కామ కామాయ స్వాహా!!'' ★